



# కరపత్రం

SINCE 2014

బుధవారం జూలై 16 2025 | సంపుటి :0 | సంచిక :271 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# జీనోమ్ వ్యాలీ తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చింది






- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షామీర్‌పేటలోని జీనోమ్ వ్యాలీలో పర్యటించారు.
- ఆయన ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.
- ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
- తెలంగాణకు జీనోమ్ వ్యాలీ పరిశ్రమలు గుర్తింపు తెచ్చాయి.
- దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33% జీనోమ్ వ్యాలీ నుంచే జరుగుతోంది.
- కోవిడ్ సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేశారు.



హైదరాబాద్:
శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.
"జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగాం" అని సీఎం అన్నారు.
అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు.

## సీఎంల భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదు: కేంద్రానికి తెలంగాణ లేఖ



గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది.

2 లో



## శ్రీశైలం గేట్లు మూసివేశారు : పై నుంచి తగ్గిపోయిన వరద


శ్రీశైలం జలాశయానికి కొనసాగిన వరద ప్రవాహం కాస్త తగ్గింది. ఎగువ నుండి వరద ప్రవాహం తగ్గడంతో.. ప్రాజెక్టు అధికారులు గేట్లు మూసివేశారు. కొన్ని రోజులుగా ఎన్నడూ లేని విధంగా కొన్ని రోజులుగా శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి..

2 లో

# చిరునవ్వుతో బయటకు వచ్చిన శుక్లా..

డ్రాగన్ క్యాప్సూల్ నుంచి మెడికల్ చెకప్స్‌కు క్రూ టీం








- తెలంగాణలో 42% రిజర్వేషన్లలో 10% ముస్లింలకు కేటాయిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.
- ఈ నిర్ణయం అమలు చేస్తే అసెంబ్లీ లోపల, బయటా బీజేపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు.
- బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తేనే రిజర్వేషన్లకు మద్దతిస్తామని చెప్పారు.
- 12% ఉన్న ముస్లింలకు 100% రిజర్వేషన్లు, 51% ఉన్న బీసీలకు కేవలం 32% రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమని ప్రశ్నించారు.
- దీనివల్ల బీసీలకు అదనంగా కేవలం 5% మాత్రమే దక్కుతుందని తెలిపారు.
- త్వరలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామని ప్రకటించారు.

42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు అన్యాయం: కేంద్ర మంత్రి బండి సంజయ్
తెలంగాణలో అమలు చేయనున్న 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అదే జరిగితే అసెంబ్లీ లోపల, బయటా బీజేపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను తీసేస్తేనే మద్దతిస్తామని చెప్పారు. తెలంగాణలో12 శాతమున్న ముస్లిలంకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా..? 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయడమేంటని ప్రశ్నించారు. అలాగైతే బీసీలకు అదనంగా దక్కేది 5 శాతం మాత్రమేనని అన్నారు. అతి త్వరలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామని తెలిపారు. బనకచర్లపై తెలంగాణ వాదనను గట్టిగా విన్పించాలని సీఎం రేవంత్ కు సూచించారు బండి సంజయ్. బనకచర్ల విషయలో రాజకీయాలకు అతీతంగా సీఎంకు అండగా ఉంటామని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

## ప్రియుడితో కలిసి భర్తను చంపించి..

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి..



2లో..

## ఏసీబీ అదుపులో విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు



2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జూలై 16 2025

# జన, కుల గణనలో కీలకాంశాలు

సుదీర్ఘ జాప్యం, అనిశ్చితి అనంతరం ఎట్టకేలకు 2027లో జాతీయ జనాభా లెక్కల సేకరణ కోసం భారత రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే ఈ జనగణనలో ప్రధాన మార్పు ఏమిటంటే కులగణనను చేర్చాలని నిర్ణయించడం. కులగణనను అధికార బిజెపి, దాని సైద్ధాంతిక మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసమే ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఇప్పుడు బిజెపి ప్రతినిధి చెబుతున్నప్పటికీ ఈ నిర్ణయం వెనుక సూత్రబద్ధమైన నిబద్ధత కంటే రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అర్థమవుతోంది.కోవిడ్-19 మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైనప్పటికీ ఆ తర్వాత దానిని చేపట్టడంలో బిజెపి పెద్దగా ఆసక్తి చూపలేదు. బహుశా నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా జరపాలని భావించి ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారం 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన ఆధారంగా పునర్విభజన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2026కు ముందు జనాభా లెక్కల సేకరణ జరిపితే పునర్విభజనను చేపట్టడం సాధ్యపడదు. ఇప్పుడు 2027లో జనగణన జరపాలని నిర్ణయించినందున వెంటనే పునర్విభజన కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నారు.కులగణన చేపట్టాలన్న డిమాండ్లను బిజెపి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంది. కులాల వారీగా లెక్కల సేకరణను వ్యతిరేకించాలని తాము విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు 2021లో లోక్‌సభకు కేంద్రం తెలియజేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. ప్రధానమంత్రి స్వయంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో చేసిన ప్రసంగంలో కుల విభజనను తక్కువ చేసి మాట్లాడారు. భారతదేశంలో కేవలం నాలుగు కులాలు%ఔ%మహిళలు, యువత, రైతులు, పేదలు%ఔ%మాత్రమే ఉన్నాయని ఆయన ప్రకటించారు.కులగణన విషయంలో బిజెపి దీర్ఘకాలిక వ్యతిరేకత దాని భావజాలంలోనే ఉంది. కులగణనను సంఘ్‌పరివార్ ఎప్పుడూ అనుమానంగానే చూస్తోంది. అది హిందూ సమాజంలోని తీవ్ర అసమానతలను బయటపెడుతుందని, తాము హిందూత్వ ద్వారా కోరుకున్న ఐక్యతను దెబ్బతీస్తుందని భయపడింది. అయితే వాస్తవానికి కుల గణాంకాలు అట్టడుగు వర్గాల స్వరాన్ని పెంచుతాయని, వనరులను మరింత సమానంగా పంపిణీ చేయాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తాయని, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మత సమీకరణ వ్యూహాన్ని సవాలు చేస్తాయని సంఘ్‌పరివార్ ఆందోళన చెందుతోంది.రాజకీయ యూటర్న్‌అయినప్పటికీ బిజెపి తన వైఖరిని మార్చుకుంది. 2024 ఎన్నికలలో ఎదురైన పరాజయాలు, ఓబీసీ ఓటర్లలో పడిపోతున్న మద్దతును దృష్టిలో పెట్టుకొని 2027 జనగణనలో కులాల వారీ సమాచారాన్ని సేకరిస్తామని ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత మార్పుగా కన్పిస్తోంది. కులగణనను ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శిస్తున్న బిజెపి, వారి ప్రభావాన్ని తటస్థం చేసేందుకు వాటి డిమాండ్‌నే అందిపుచ్చుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం సానుకూల వైఖరి ప్రదర్శించింది. ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించనంత వరకూ కులాల సమాచారాన్ని సంక్షేమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

చాలా కాలంగా కుల ఆధారిత సమాచారం అందుబాటులో లేకపోవడానికి కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ పార్టీ కులగణనను నిర్వహించలేదు లేదా మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి)ను చేపట్టింది కానీ దానిని ఉద్దేశపూర్వకంగానే సార్వత్రిక గణన నుండి వేరుచేసింది. ఆ తర్వాత కచ్చితత్వం లోపించిందంటూ కులగణనను పక్కన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎస్.ఇ.సి.సి డేటాను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఈ ప్రక్రియ కోసం ఖర్చు చేసిన రూ.5,000 కోట్ల ప్రజాధనం వృథా అయింది.

భారతదేశంలో కులగణనకు సుదీర్ఘమైన, విభిన్నమైన చరిత్ర ఉంది. 1881 నుండి 1941 వరకూ జనాభా లెక్కల సేకరణలో కులాల సమాచారాన్ని కూడా తీసుకునే వారు. స్వాతంత్ర్యానంతరం దీనికి స్వస్తి చెప్పారు. ఇకపై జనాభా లెక్కల సేకరణలో కుల ప్రస్తావన ఉండబోదని 1950లో వల్లభ్‌భాయ్ పటేల్ ప్రకటించారు. కుల సమాచార సేకరణను తిరిగి ప్రారంభించాలని 1953లో కాకా కాలేల్కర్ నేతృత్వంలోని వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్, ఆ తర్వాత 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరాయి. కచ్చితమైన సంఖ్య లేనిపక్షంలో రిజర్వేషన్లు, సంక్షేమ విధానాలు లోపభూయిష్టంగా ఉంటాయిని వాదించాయి. అయినప్పటికీ ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను పట్టించుకోలేదు. రాబోయే జనగణనలో కులాల సమాచారాన్ని సేకరించాలని 2021లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.జాతీయ స్థాయిలో కులాల సమాచారం లేకపోవడంతో అనేక రాష్ట్రాలు సొంతగా కుల సర్వేలు ప్రారంభించాయి. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి 1968లో కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ పద్ధతిలో కుల వివరాల సేకరణ కోసం కులాలు, వర్గాలపై సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 63 శాతానికి పైగా ఉన్నారని 2023లో బీహార్‌లో నిర్వహించిన కుల సర్వే తేల్చింది. దీంతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 నుండి 65 శాతానికి పెంచింది. అయితే కోర్టు వివాదం కారణంగా దాని అమలు ఆగిపోయింది. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం 2024లో కుల సర్వే నిర్వహించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించింది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం కోసం దానిని పంపింది. కర్ణాటక సైతం తన సామాజిక-ఆర్థిక, విద్యా సర్వే ద్వారా చర్యలు చేపట్టింది. అయితే రాజకీయ అనిశ్చితులు, డేటా చెల్లుబాటుపై ఆందోళనల నేపథ్యంలో ఆ నివేదికను ఇంకా ప్రచురించలేదు.రాష్ట్రాలవారీగా జరిగిన కుల సర్వేలు, వివిధ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వాటి తక్షణ రాజకీయ ప్రయోజనాల రీత్యా కులాల వారీగా లెక్కలు సేకరించడానికి బిజెపి అంగీకరించాల్సి వచ్చింది. 2027 జనగణన రెండు దశలుగా జరుగుతుంది. 2026 అక్టోబరులో ప్రారంభమయ్యే తొలి దశలో మంచు కురిసే ప్రాంతాలలో జనగణన చేపడతారు. 2027 మార్చి 1న రెండో దశ ప్రారంభమవుతుంది. దీనిలో దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనాభా లెక్కలను సేకరిస్తారు. జనగణనలో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది గృహాలను లెక్కించడం, గృహాల గణన. ఆ తర్వాత జనాభా లెక్కలు సేకరిస్తారు. మొదటిసారిగా జనగణనను పూర్తిగా డిజిటలీకరణ చేస్తున్నారు . మొబైల్ యాప్స్, స్వీయ గణన, రియల్-టైమ్ పర్యవేక్షణను అందులో చేరుస్తారు. జనాభా లెక్కల సేకరణ దశలో కుల సమాచారాన్ని తీసుకుంటారు. గణన పూర్తయిన పది రోజులలో ప్రాథమిక సమాచారాన్ని విడుదల చేస్తారు. అనంతరం ఆరు నెలలలో సవివరమైన విభజన డేటా విడుదలవుతుంది. ఈ కాలక్రమాన్ని పాటించినట్లయితే మొత్తం పునర్విభజన ప్రక్రియను 2029 ఎన్నికల లోగానే పూర్తి చేయవచ్చు. అయితే తన తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మొత్తం ప్రక్రియను బిజెపి మార్చే అవకాశం కూడా ఉంది.

### రాజకీయ చిక్కుముడులు, సవాళ్లు

జనగణనలో కులాన్ని చేర్చడం వల్ల వివిధ కులాల సంఖ్య, వాటి సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం లభిస్తుంది. రిజర్వేషన్ల పెంపు, ఓబీసీల ఉప-వర్గీకరణ, రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపు డిమాండ్లను బలపరచడానికి ఇది దోహదపడవచ్చు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన (ఇ.డబ్ల్యు.ఎస్) వారికి పది శాతం కోటా వెనుక ఉన్న హేతుబద్ధతను ధృవీకరించడానికి లేదా తిరస్కరించడానికి కూడా ఈ డేటా ఉపకరిస్తుంది. ఓబీసీల క్రీమీలేయర్ ప్రమాణాలను పరిశీలించవచ్చు. ఈ డేటా కొత్త సమాచారాన్ని వెల్లడిస్తే ఎస్సీలకు కూడా విస్తరింపజేయాలన్న డిమాండ్ ఊపందుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రైవేటు రంగానికి దీనిని విస్తరించాలనే అభిప్రాయం కులగణనతో బలపడుతుంది.

# శ్రీశైలం గేట్లు మూసివేశారు : పై నుంచి తగ్గిపోయిన వరద

మొదటిపేజీ తరువాయి

డ్యామ్ పూర్తి స్థాయిలో నిండటంతో ఈ నెల 8న సీఎం చంద్రబాబు విషయం తెలిసిందే. అయితే డ్యామ్ గేట్లను తెరవడంతో శ్రీశైలానికి భక్తులు, పర్యాటకులు పోటెత్తారు. కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

**ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వివరాలు**

ఇన్ ఫ్లో : 66, 494 క్యూసెక్కులు
ఔట్ ఫ్లో : 68,753 క్యూసెక్కులు
పూర్తిస్థాయి నీటి మట్టం: 885 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం: 882.50 అడుగులు
పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు
ప్రస్తుతం నీటి నిల్వ : 201.5820 టీఎంసీలు

# చిరునవ్వుతో బయటకు వచ్చిన శుక్లా..

మొదటిపేజీ తరువాయి


18 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో గడిపిన శుభాంశు శుక్లా టీం భూమికి చేరుకున్నారు. కాలిఫోర్నియా తీరంలో స్పేస్ డ్రాగన్ క్యాప్సూల్ నుంచి ఒక్కొక్కరుగా క్రూ మెంబర్లను బయటకు తీసుకొచ్చారు స్పేస్ ఎక్స్ టీం. ముందుగా కమాండర్ పెగ్గీ విట్సన్ ను బయటకు తీసుకొచ్చారు. స్పేస్ ఎక్స్ టీమ్ చేతులు పట్టుకుని ఆమెను మెడికల్ చెకప్స్ కు తీసుకెళ్లారు.
ఆ తర్వాత క్రూ గ్రూప్ కమాండర్ శుభాంశు శుక్లాను బయటకు తీసుకొచ్చారు స్పేస్ ఎక్స్ సభ్యులు. బయట కాలుమోపిన శుక్లా చిరునవ్వుతో అభివాదం చేశాడు. సిబ్బంది సహకారంతో మెల్లమెల్లగా అడుగులు వేస్తూ ఇనిషియల్ చెకప్స్ కు వెళ్లాడు.
మొత్తం 20 రోజుల తర్వాత శుక్లా టీం గ్రావిటీని (భూమ్యాకర్షణ శక్తిని) చూస్తోంది. పెగ్గీ విట్సన్, శుక్లా తర్వాత మిగతా క్రూ మెంబర్లను కిందికి దించారు. అందరినీ ఇనిషియల్ మెడికల్ చెకప్స్ కోసం పంపించారు.
జులై 14న అంతరిక్ష కేంద్రం నుంచి బయల్దేరిన డ్రాగన్ స్పేస్ షిప్.. మంగళవారం(జులై 15) మధ్యాహ్నం 3 గంటలకు కాలిఫోర్నియా సముద్రంలో డ్రాగన్ క్యాప్సూల్స్ ల్యాండింగ్ అయ్యింది. ఫసిఫిక్ మహాసముద్రంలో జరిగిన స్ప్లాష్ డౌన్ స్పాట్ లో క్రూ మెంబర్లను బయటకు తీసుకొచ్చేందుకు కాస్త ఆలస్యం జరిగింది. స్ప్లాష్ డౌన్ స్పాట్ డ్రాగన్ క్యాప్సూల్స్ దిగిన వెంటనే కెమికల్ స్ప్రే చేశారు. డ్రాగన్ క్యాప్సూల్స్ హాచ్ ఓపెన్ చేసిన స్పేస్ ఎక్స్ క్రూ.. రికవరీ షిప్ నుంచి ఆస్ట్రోనాట్స్ వచ్చిన వెంటనే మెడికల్ టీమ్ ఇనిషియల్ చెకప్స్ కోసం క్రూ మెంబర్లను తరలించారు. ఈ సందర్భంగా స్ప్లాష్ డౌన్ విజయవంతం అయినందుకు నవ్వుతూ అభివాదం తెలిపాడు శుక్లా.

# ఏసీబీ అదుపులో విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఇన్ ఛీఫ్ జూబ్లీహిల్స్‌లోని మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ను విచారించనున్నారు. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌తో పాటు మురళీధర్‌రావు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఈఎన్‌సీ జనరల్‌గా కీలకంగా వ్యవహరించిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. ఆ తర్వాత ములీధర్‌రావు పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది.

# పార్లమెంట్ సమావేశాలు.. కాంగ్రెస్ వ్యూహాత్మక భేటీ



దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో కేంద్రాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి, బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించడం, దేశవ్యాప్తంగా మహిళలపై చోటు చేసుకుంటున్న దారుణాలను పార్లమెంట్ ఉభయసభల్లో లేవనెత్తేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వ్యూహాత్మక సమావేశంలో నిర్ణయించారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగం, రైతు సమస్యలు, దేశ భద్రతపైనా ప్రశ్నలు లేవనెత్తేందుకు కాంగ్రెస్ సిద్ధమవతోంది. జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే.సోనియాగాంధీ నేతృత్వంలో 10 జన్‌పథ్‌లో పార్లమెంటరీ వ్యూహాత్మక కమిటీ సమావేశమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, సురేశ్, మాణికమ్ ఠాగూర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం తివారీ మీడియాతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై పార్లమెంట్‌లో ప్రత్యేకంగా చర్చించాలని డిమాండ్ చేశారు. కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? ఉగ్రవాద నిర్మూలకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని అన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపించి..

మొదటిపేజీ తరువాయి

ఆత్మకూరు: సినీ ఫక్కీలో భర్తను హత్య చేయించిన భార్యను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె ప్రియుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. మరో నిందితుడు రామలింగస్వామి పరారీలో ఉండగా.. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన స్వామి (38) హత్యకు గురయ్యాడు. భార్య స్వాతి తన ప్రియుడు సాయికుమార్, సోదరుడు మహేశ్‌తో కలిసి భర్తను చంపించింది. బైక్‌పై వెళ్తున్న స్వామిని కారుతో ఢీకొట్టించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించింది. స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం బయటపడింది. స్వాతి, సాయికుమార్, మహేశ్‌పై పోలీసులు హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి 3 ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# సీఎంల భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదు: కేంద్రానికి తెలంగాణ లేఖ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.
కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది.
గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న (బుధవారం) సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాల సీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు రాష్ట్రాల తరఫున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాకపోవడంతో 16వ తేదీకి వాయిదావేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు తెలిసింది.
ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించుకొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. గోదావరి-బనకచర్ల వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదన వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్రమంత్రితో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది.

# ఇన్‌ఫ్లూయెన్సర్‌తో వివాహేతర సంబంధాన్ని వదలని సృజన్.. అందుకే డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య

హసన్‌పర్తి: సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌తో వివాహేతర సంబంధాన్ని వదిలిపెట్టబోనని భర్త తేల్చిచెప్పడంతోనే డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడినట్లు కాజీపేట పోలీసులు తెలిపారు. నిందితులైన ప్రత్యూష భర్త సృజన్, ఆయన తల్లిదండ్రులు, సృజన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.ప్రత్యూష-సృజన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి కుటుంబం హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రి పబ్లిసిటీ కోసం యాజమాన్యం సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను పిలిపించారు. ఆమెతో సృజన్‌కు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి కుటుంబాన్ని పట్టించుకోని సృజన్.. భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. శ్రుతిని వదిలిపెట్టలేనని తేల్చి చెప్పాడు. భర్తతోపాటు అత్తమామలు, ఇన్‌ఫ్లూయెన్సర్ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13న సృజన్, ప్రత్యూష మధ్య గొడవ జరిగింది. వివాహేతర సంబంధాన్ని వదిలేయాలని ఎంత చెప్పినా భర్త తన మాట వినకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష.. అదే రోజు సాయంత్రం గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.భార్య ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో సృజన్ కిటికీ నుంచి చూడగా.. ప్రత్యూష ఉరివేసుకోవడం కనిపించింది. వెంటనే తన స్నేహితులకు సమాచారం అందించిన సృజన్.. వారి సాయంతో ప్రత్యూషను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యూష తల్లి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రత్యూష మరణించడంతో భర్త సృజన్, అత్తమామలు, ఇన్‌ఫ్లూయెన్సర్ పోలీసుల కంట కనిపించకుండా తప్పించుకొని తిరిగారు. కాకతీయ వింటేజ్ విల్లాస్ వద్ద పోలీసులు గస్తీ కాస్తున్న విషయం తెలియక మంగళవారం ఉదయం ఆ నలుగురు కారులో అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జూలై 16 2025

# అహం క్షాత్రం ... అహం బ్రాహ్మణం

శివప్రసాద్, కరపత్రం ఎడిటర్

ఇది జరిగిన యదార్ధ సంఘటన ఇక్కడ ఫోటోలో కనిపిస్తున్న మహానుభావుని పేరు శ్రీ కృష్ణమూర్తి అయ్యర్, వయస్సు 65 సంవత్సరాలు. ఈయన తిరుచ్చిలో నివాసముంటున్నారు. ఈయన్ని అందరూ కిట్టూ మామ అని పిలుస్తుంటారు.వీరు పేద బ్రాహ్మణులు, వీరి జీవనాధారం ఒక చిన్న ఇడ్లీ కొట్టు. తనకు వ్యాపారంలో తన భార్య తోడుగా ఉంటుంది. వ్యాపారంలో కేవలం లాభాలు మాత్రమే చూసుకోకుండా తనకున్నదాంట్లో ఆకలితో బాధపడేవారికి అన్నం పెడుతూ, తన స్థాయికి తగిన దాన ధర్మాలు కూడా చేస్తుంటారు. ఆ ప్రాంతంలో ఉండే కౌన్సిలర్ పాండియన్, మద్యం తాగి, తన వాళ్ళతో కిట్టు మామ కొట్టుకు వచ్చి కడుపు నిండా తిన్నాడు. తను తిన్నవాటికి బిల్లు కట్టమని కిట్టు మామ భార్య అడిగితే, పాండియన్ కు కోపం వచ్చింది.

**– ఈ ప్రాంతపు కౌన్సిలర్ నే డబ్బులు అడుగుతారా ? అంటూ కొట్టులోని సామాన్లను బయట పారేసి గొడవ చేసాడు.**

అడ్డుగా వెళ్ళిన కిట్టు మామను తిడుతూ, బ్రాహ్మణుడివి నీకు అంత ధైర్యం ఉందా అంటూ ్తన జంధ్యం పట్టుకున్నాడు
అప్పటి వరకూ ఓర్చుకున్న కిట్టు మామకు జంధ్యం పట్టుకోగానే పౌరుషం రగిలింది. ఒక్కసారిగా విరుచుకుపడి, పక్కనే ఉన్న కర్రతో పాండియన్ ను, తన మనుషులను చితకబాది పారేసాడు.

**నాకు యుద్ధ కళలు కూడా వచ్చు జాగ్రత్త అన్నాడు.**

దాంతో అహం దెబ్బ తిన్న పాండియన్ .. నీ అంతు చూస్తా, రేపు నీ కొట్టు లేకుండా చేస్తా అంటూ బెదిరించి వెళ్ళిపోయాడు.
మరుసటి రోజు పాండియన్ కొట్టు దగ్గరకు రాలేదు, కానీ కిట్టు మామకు ఒక విషయం తెలిసింది.
నిన్న రాత్రి గొడవ పడి వెళ్తున్న పాండియన్ బండికి ఆక్సిడెంట్ అయ్యింది అని, అంతే కాదు ఆ ఆక్సిడెంట్ లో పాండియన్ కు బలమైన గాయాలయ్యాయని, రక్తం చాలా పోయిందని తెలిసింది.
అయితే పాండియన్ కు వెంటనే ఆపరేషన్ చేయాలి అని,



అతని బ్లడ్ గ్రూపు అరుదుగా దొరికేది, ఆ హాస్పిటల్ లో ఆ గ్రూప్ బ్లడ్ లేదు.
పాండియన్ బ్లడ్ గ్రూప్ అతని బంధువులతో,అతని మనుషుల బ్లడ్ తో మ్యాచ్ కాలేదని కూడా కిట్టు మామకు తెలిసింది.

**పాండియన్ ది .. తనది ఒకే గ్రూప్ బ్లడ్ అని కిట్టు మామకు తెలిసింది.**

ఆ గ్రూప్ రక్తం హాస్పిటల్ వద్ద స్టాక్ లేదని .. ఆ బ్లడ్ గ్రూపు వారు ఎవరైనా ఉంటే వెంటనే వచ్చి రక్త దానం చేయమని చెప్పారట.

**– విచిత్రంగా కిట్టు మామ బ్లడ్ గ్రూపు కూడా అదే కావడంతో వెంటనే కిట్టు మామ హాస్పిటల్ కు వెళ్ళి, రక్త దానం చేసి, ఆపరేషన్ అయ్యేంత వరకూ ఉండి వెళ్ళాడు**

ఆరోగ్యం కాస్త కుదుట పడ్డాక కిట్టు మామ చేసిన సహాయం గురించి తెలుసుకుని పాండియన్ కిట్టు మామ దగ్గరికి వెళ్ళి క్షమాపణ చెబుతూ .. లక్ష రూపాయలు ఇవ్వబోయాడు.అప్పుడు కిట్టు మామ అన్న మాటలు “అయ్యా, ఆరోజు మీరు డబ్బులు లేవు అని చెప్పి ఉంటే నేను ఊరుకునేవాడిని, మీరు నేనెందుకు కట్టాలి అని గొడవ చేసారు.మీరు పెద్ద స్థాయి వారు కనుక భరించాను, కానీ మీరు నా జంధ్యం తెంపాలని ప్రయత్నించారు.
ఒక బ్రాహ్మణుడిగా జంధ్యం కాపాడుకోవడం నా కర్తవ్యం కనుక కోపంతో కొట్టాను.
మీరు ఆపదలో ఉన్నారని తెలిసి మిమ్మల్ని కాపాడడం కూడా నా కర్తవ్యం అని వచ్చి రక్త దానం చేసాను.
అంతే తప్పా ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు, ఇంత డబ్బు నాకు అవసరం లేదు, మీ తృప్తి కోసం మీరు అంతగా ఇవ్వాలనుకుంటే నా బిల్లు డబ్బులు మాత్రం ఇస్తే చాలు అన్నాడట.
కిట్టు మామ ఔదార్యానికి పాండియన్ కన్నీళ్ళ పర్యంతమయ్యాడట.అపకారికి కూడా ఉపకారం చేసే మీలాంటి మహానుభావులు ఇంకా ఉన్నారంటే మనసుకెంతో ఆనందం కలుగుతుంది అంటూ కిట్టు మామకు క్షమాపణలు చెప్పాడు.ఇంగ్లీష్ వాళ్ళు, మొగలాయిలు మన భారత సమాజాన్ని విచ్చిన్నం చేయాలని బ్రాహ్మణులను విలన్లుగా చిత్రిస్తూ వచ్చారు.
బ్రాహ్మణులు బలహీనులు కాబట్టి ఎన్నో రకాలుగా దాడులు చేస్తూ వచ్చారు.

**– ముఖ్యంగా క్రైస్తవ కమ్యూనిస్టు భావ జాల ప్రభావితులు ఈ కుట్రను అనుసరిస్తూ వస్తున్నారు**

బ్రాహ్మణులు సహన శీలురు.. బ్రాహ్మణులు బలహీనులు కాదు.భారత దేశం అంతటా తిరుగుతూ 21 సార్లు దుష్ట సంహారం చేసిన పరశురాముడు బ్రాహ్మణుడు.విచ్చలవిడిగా చెలరేగిన క్షత్రియులను, పాలకులైన దుష్ట శక్తులను అంతం చేస్తూ జైత్ర యాత్ర చేసిన పరశురాముణ్ణి ఒక అవతారంగా ఈ దేశం గౌరవిస్తుంది.బ్రాహ్మణులు పిరికివారు కాదు.హిందుత్వం వదలి క్రైస్తవులుగా మారిన కొందరు హిందుత్వం పై దాడి చేస్తూ బ్రాహ్మణులను విలన్లుగా చిత్రించినా... బ్రహ్మ విద్య నశించదు.భారతీయ భాషలు సరిగ్గా తెలియని వారు..సంస్కృతం అసలే తెలియని వారు తమకు తోచిన వ్యాఖ్యానాలు చేస్తూ హిందుత్వాన్ని ఎంత అపహాస్యం చేసినా ఫలితం ఉండదు..

**– అహం క్షాత్రం ... అహం బ్రాహ్మణం**

అహం క్షాత్రం అహం బ్రాహ్మణం” అనేది ఒక భారతీయ సూక్తి.
దీని అర్థం “నేను క్షత్రియుడిని, నేను బ్రాహ్మణుడిని” అని.
బ్రాహ్మణుల విద్యాభ్యాసం లోనే ఒక సహనశీలత ఉంటుంది.
బ్రాహ్మణులకు అన్ని విద్యల్లో ప్రవేశముంటుంది.
హింస కూడా చేయగలరు, కానీ చేయరు.
హింసను ఆపద్ధర్మంగా ఉపయోగించడమే వారి ఉన్నత అభ్యాసం.
వర్ణ వ్యవస్థ లో ఒక వర్ణం నుండి ఇంకో వర్ణానికి వ్యక్తులు మారుతూ ఉంటారు.
ఏ కాలమైనా.. ఏ దేశమైనా .. ఏ వ్యవస్థ అయినా..సమాజం నాలుగు వర్గాలుగా విభజించబడి మనుగడ సాగిస్తాయి.
మేధావి వర్గం..అంటే బ్రాహ్మణ వర్ణం
రక్షణ వర్గం .. అంటే క్షత్రియ వర్ణం
వ్యాపార వర్గం .. అంటే వైశ్య వర్ణం
కార్మిక వర్గం .. శూద్ర వర్ణం

ఈ నాలుగు వర్గాలు లేకుండా ఏ దేశమూ నడవదు..
ఏ సమాజమూ నడవదు.

మనం ఎన్నుకున్న పని బట్టి వర్ణం విభజించబడుతుంది.

శూద్రుడైన అంజయ్య పాలకుడు అయ్యాడు..అంటే క్షత్రియుడు.
బ్రాహ్మణుడైన పివి పాలకుడయ్యాడు..అంటే క్షత్రియుడు అయ్యాడు.
దళితుడైన సంజీవయ్య పాలకుడయ్యాడు అంటే క్షత్రియుడయ్యాడు.
వైశ్యుడు అయిన రోశయ్య పాలకుడయ్యాడు అంటే క్షత్రియుడయ్యాడు.


ఇలా ఎందరో శూద్రులైన వారు పాలకులయ్యారు.
కమ్మ రెడ్లు కూడా శూద్ర వర్ణం అని అందరికీ తెలుసు.
ఎన్టీఆర్, చెన్నారెడ్డి తో పాటు ఎందరో పాలకులయ్యారు.
అంటే వారి వారి పని బట్టి,బాధ్యతలు బట్టి వర్ణం మారింది..మారుతూనే ఉంటుంది.
**ఈ నాలుగు వర్గాలే.. నాలుగు వర్ణాలు..**
**ఇదే వర్ణ వ్యవస్థ..**

**– వర్ణం అంటే కులం కాదు**

# గొప్పవారి వ్యంగ్యాస్త్రాలు

## గొప్ప చమత్కారాలు

మద్రి శంకరయ్య, అకడమిస్ట్ హైద్రాబాద్




ఒకసారి కవిసమ్మేళనం జరుగుతోంది.కవులందరూ విచ్చేసారు.మహాకవి శ్రీ విశ్వనాథ సత్యన్నారాయణ గారూ కూడా సభకు విచ్చేసారు.ఆయన్ని చూసి కవులందరూ వారిని సగౌరవంగా స్వాగతించారు.శ్రీ గుర్రం జాషువా మాత్రం ఏదో పుస్తక పఠనంలో ఉండిపోయారు.అదిచూసిన విశ్వనాథ వారు జాషువా ను ఉద్దేశించి,“పక్షి నారాకను గమనించలేదు” అన్నారు.అది విని కవులందరూ ఇంతటి మహాకవి జాషువాని పక్షితో పోలుస్తారా అని ముక్కున వేలు వేసుకున్నారు.కానీ జాషువా మాత్రం చిరునవ్వుతో లేచి విశ్వనాథ గారికి నమస్కరించి,“మీలాంటి కిరాతకుల దృష్టి ఎప్పుడూ పక్షులమీదే కదా” అన్నారు.
విశ్వనాధుని ఈ జాషువా అంత మాట అంటాడా అని కవులందరూ మళ్ళీ నిశ్చేష్టులయ్యారు.కానీ జాషువా అన్న మాటకి విశ్వనాధులు పగల పడి నవ్వేశారు దీని అంతరార్ధం ఏమిటంటే.. విశ్వనాథుల వారు జాషువా ని పక్షి తో ఎందుకు పోల్చేరంటే... జాషువాకి ఆ సభలో “కవి కోకిల” అనే బిరుదు ఇస్తున్నారు. కోకిల ఒక పక్షి కదా అందుకే జాషువాకి కోపం రాలేదట.ఇక జాషువా విశ్వనాధుని కిరాతకుడు అన్నారు.కిరాతకుడు అంటే విశ్వనాదులవారు “శ్రీ రామాయణ కల్పవృక్షం” అని రామాయణం రాస్తున్నారు అందుకు జాషువా ఆయన్ని కిరాతకుని తో పోల్చాడు.రామాయణం రాసిన వాల్మీకి పూర్వాశ్రమంలో కిరాతకుడు కదా..కిరాతకుడు అంటే వేటగాడు.ఇంకో విషయం...జాషువా విశ్వనాధుల వారి అనుంగు శిష్యుడు..

## గగన్‌యాన్‌కు శుభాంశు శుక్లా అనుభవం జోడింపు

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్ వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చారు. 18 రోజుల పాటు ఆయన అంతరిక్షంలో గడిపారు. దీనిపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో స్పందించింది. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో శుక్లా సొంతం చేసుకున్న అనుభవం గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో కీలకం కానుందని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ ఎం దేశాయ్ అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. ఈ యాత్ర విజయంతో రోదసిరంగంలో భారత్ శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకుంది. ఇది యావత్ ప్రపంచానికి గర్వకారణం. ఈ క్షణం భారత్‌కు మాత్రం అత్యంత ప్రత్యేకమైనదని హర్షం వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే.. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. భారత అంతరిక్ష కార్యక్రమాల్లో ఇది కీలకం కానుంది. ఈ క్రమంలో చేపడుతున్న పరీక్షలు విజయవంతం అవుతున్నాయి. ఈ గగన్‌యాన్ ప్రాజెక్టు ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయనుంది.

# భూ వివాదంలో ప్రాణభయం: మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి .

**కరపత్రం ప్రతినిధి /శంకరపట్నం,జూలై 15:**
శంకరపట్నం మండలం, మొలంగూర్ (గుడాటిపల్లె) గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, భూ వివాదాల నేపథ్యంలో గుర్రం సంజీవ్ రెడ్డి, కిషన్ రెడ్డి కుటుంబ సభ్యుల నుంచి తమకు న్యాయం కావాలని మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు.శ్రీధర్ రెడ్డి తన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, 2006లో గుర్రం కిషన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి తమ తండ్రి పెద్ద మల్లారెడ్డికి సర్వే నెం. 231లో 8 గుంటల భూమిని విక్రయించారు. 2023లో శ్రీధర్ రెడ్డి తన పేరు మీద 4 గుంటలు, తన అన్నయ్య తిరుపతి రెడ్డి పేరు మీద 4 గుంటలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గ్రామ పంచాయతీ నుండి అన్ని అనుమతులు పొంది, దాదాపు రూ. 15 లక్షలు ఖర్చు చేసి స్లాబ్ స్థాయి వరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు కిషన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి కూడా హాజరయ్యారు.
అయితే, వారి కుమారులు రాజేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ, భూమిని




తమ పేరు మీద రిజిస్టర్ చేయాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. పలు కోర్టు కేసులతో మానసిక వేదనకు గురి చేశారని, అన్ని తీర్పులు తమకు అనుకూలంగా వచ్చినా, బెదిరింపులు కొనసాగడంతో ఆ ఇంటిని అక్కడే వదిలేసి, ఎలాంటి వివాదాలు లేని తమ స్వంత భూమి సర్వే నెం. 239B/1లో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నామని తెలిపారు.
అయినప్పటికీ, గుర్రం సంజీవ్ రెడ్డి, కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులు తమపై పగ పెంచుకొని, తమ వ్యవసాయ బావిని పూడ్చివేసి, ఆరు గుంటల భూమిని అమ్మివేయాలని బెదిరిస్తున్నారని శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమి వెనుక వారికి రోడ్ ఫేస్ లభించాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.
శంకరపట్నం సబ్ ఇన్‌స్పెక్టర్‌కు వారి పొలంలోని ఖనీలను తమ పొలంలో పడేసి ఫిర్యాదు చేశారని, హుజురాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు తమపై దాడి చేశారని తప్పుడు కేసులు పెట్టారని శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ విధంగా రకరకాలుగా అక్రమ కేసులు పెడుతూ, ఎలాగైనా భూమిని అమ్మించాలని బెదిరిస్తున్నారని ఆయన వాపోయారు. వారి నుండి తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, దీనిపై పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని శ్రీధర్ రెడ్డి మానవ హక్కుల కమిషన్‌ను కోరారు.

# ఎన్ ఎస్ యూ ఐ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్సీ చిత్రపటాలకు పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జులై 15**
ఇల్లందకుంట మండల ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు అన్వేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఏమ్మెల్సీ బల్మూర్ వెంకట్ చిత్ర పాటలకి పాలాభిషేకం 10ఎండ్ల కల నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర సర్కార్ బీసీ లకి 42 శాతం రిజర్వేషన్ హర్షణీయం తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం 100 మంది యువకులతో కార్యక్రమం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వలసాని సుమన్ ఏదైతే నిన్న తెలంగాణ ప్రజాపాలనలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతోని తెలంగాణ రాష్ట్రంలో 5 లక్షల 61 వేల కొత్త రేషన్ కార్డులు విడుదల చేయడం జరిగింది కొత్తగ ఇచ్చినటువంటి 5 లక్షల 61 వేల కొత్త రేషన్ కార్డులో 17 లక్షల మంది వరి వారి కార్డుల్లో పేర్లు ఎక్కించుకున్నారు అందులో భాగంగా 26 లక్షలా మందికి రేషన్ కార్డు లోపల పేరు




మార్పిడి వంటివి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి సన్న బియ్యం పథకంలో నిన్న కొత్తగ 40 లక్షలా మంది అర్హులైనరు నిన్నటి నుండి రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగ పాత కొత్త రేషన్ కార్డ్ కలిగినటువంటి 3 కొట్ల 10 లక్షలా మందికి సన్న బియ్యం ఇయ్యనుంది బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారు 10 సంవస్థరాలు మేము పందుల్లా రాష్ట్రం మీద పడి దోసుకతిన్నాం మేమే ఒక్క రేషన్ కార్డ్ ఇయ్యలేదు 10 సంవత్సరాల మా పాలనలో కంది 18 నెలల్లా మీతోని సాధ్యం అయితద అని అరె నాయనా మైక్ ముందట పెట్టుకుని మాట్లాడుతూ కాదు కళ్లు తెరిచి చూడండి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతాం ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటా చిరునవ్వులు వెదజల్లడం మా అన్న రేవంతన్న బాధ్యత అందుకు కృతజ్ఞతగా ఇల్లందకుంట మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పౌరసరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి పాలాభిషేకం చేసి ఇల్లందకుంట మండల ఎన్ ఎస్ యూ ఐఅధ్యక్షులు అన్వేష్ మా యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుమన్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేయటం జరిగింది ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్,నియోజకవర్గ కార్యదర్శి ఉమ్మడి సందీప్ హుజురాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల అరవింద్ కమలాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ రెడ్డి యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రశాంత్ వీణవంక మండల అధ్యక్షులు కాటిపల్లి అజయ్ హుజురాబాద్ పట్టణ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు ఎన్ ఎస్ యూ ఐ జిల్లా కార్యదర్శి మహేష్ మోరే అజయ్ పనికెల శ్రీకాంత్ మాట్ల రాజేష్ శనిగరపు దినేశ్ సంపత్ బాబర్ అనిల్ భిక్షపతి సాయి నితిన్ రాజకుమార్ నవదీప్ సంజయ్ సంగ రాజు తదితరులు పాల్గొన్నారు

# కోతుల, కుక్కల భారీ నుండి పట్టణ ప్రజలను కాపాడండి...

**– పరిసరాల పరిశుభ్రతలో రోడ్లను శుభ్రం చేయండి.**

**– మున్సిపల్ కమిషనర్ కు బిఆర్ఎస్ మహిళా నేత ప్రభావతిరెడ్డి విజ్ఞప్తి.**



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్: జులై 15**

హుజరాబాద్ పట్టణంలో విచ్చలవిడిగా కోతులు, కుక్కలు ప్రజల మీద పడి దాడి చేయడం, కరవటం నిత్యం జరుగుతున్న సంఘటనగా మారిందని, ఇలాంటి సంఘటనలు జరిగి ఇప్పటివరకు హుజురాబాద్ పట్టణంలో కొంతమంది గాయపడటం, పలువురు మరణించడం జరిగిందని ఇప్పటికైనా హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య స్పందించి వాటి భారీ నుండి ప్రజలను కాపాడాలని బిఆర్ఎస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు పూసల ప్రభావతి రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిత్యం కోతులు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ స్కూల్ కి వెళ్లే పిల్లల మీద, ఇంటి వద్ద ఉండే మహిళల పైన పడి కరవడంతో పాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ఎంతో మంది గాయాల పాలవుతున్నప్పటికీ హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని ప్రభావతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

హుజురాబాద్ పట్టణములో ఎవరి ఇండ్ల మీద చూసిన కోతులు కనబడుతున్నాయనీ, ఈ కోతులు ప్రజలపై దాడి చేయడం, ఇళ్లల్లో చొచ్చుకొని వచ్చి ఇంట్లో వండిన ఆహార పదార్థాలు పాడు చేయడం, ఇతర వస్తువులను ఎత్తుకొని పోవటం ఇంట్లో ఉన్న వారు కోతులను వెల్లగొట్టడానికి ప్రయత్నం చేస్తే ఆ ఇంట్లో ఉన్న వ్యక్తులు మీద దాడి చేయడం, రోడ్ల వెంట వెళ్లే వారినీ కరవటం ఎక్కడంటే అక్కడ మీద దాడి చేసి గాయపరచటం ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రైవేట్ హాస్పిటల్ లకు వెళ్ల లేక ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి ఇంజక్షన్లు ఇచ్చుకోవడం ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్, వారి సిబ్బంది దృష్టికి వచ్చినప్పటికీ కూడా వారు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని ఆమె అన్నారు. గతంలో మున్సిపల్ పాలకవర్గం ఉన్నప్పుడు రెండు మూడు సార్లు కోతులను పట్టుకొని వెళ్లి ఇతర ప్రాంతాలలో, అడవిలో విడిచిపెట్టిన సంఘటనలు ఉన్నాయన్నారు. పాలకవర్గం సమయం ముగిసినప్పటి నుండి ఇప్పటివరకు ఒక్కసారి అయినా మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఈ కోతుల , కుక్కల గురించి ఒక్కసారి అయినా చర్యలు చేపట్టిన పాపాన పోలేదన్నారు. అందుకే కరీంనగర్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, హుజురాబాద్ ఆర్డీవో హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ చోరువా తీసుకొని వెంటనే కోతులను పట్టణము నుండి తరిమివేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని చాలా వాడాలల్లో అంతర్గత రహదారులు శుభ్రం చేయక చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయని వెంటనే పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి రోడ్లపై చెత్త చెదరని తొలగించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు ప్రభావతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సిపిఐ

**– డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి**

**– సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 15**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉందని. ఎన్నికల బరిలో నిలిచేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మికుంటలో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఐ పోటీ చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే మండలాల వారిగా పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించుకుంటూ కార్యాచరణను రూపొందించుకుంటూ ముందుకు వెళ్తామని స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలిపిదేయంగా ఎన్నికల బరిలో నిలుస్తామని హుజురాబాద్ నియోజకవర్గం లో ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేస్తామని ఎందుకు అనుగుణంగా క్యాడర్ను సన్నద్ధం చేస్తున్నామని ఆయన తెలియజేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించినటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నేటికీ అర్హులకు పంపిణీ చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి డబుల్ బెడ్ రూమ్ నిర్మించి పేదలకు పంచకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తుందని అటు బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయకపోవడం పేదల పట్ల ఆ పార్టీలకు ఎంత ప్రేమ ఉందో తెలియజేస్తుందని అన్నారు. తక్షణమే జమ్మికుంట మండలంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ లో ఇండ్లను పంపిణీ చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆ డబుల్ బెడ్ రూమ్లో ఇండ్ల ఆక్రమించుకొని అర్హులైన వారందరికీ సిపిఐ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో జమ్మికుంట, ఇల్లందకుంట సిపిఐ మండల కార్యదర్శిలు గజ్జి ఐలయ్య, మాదారపు రత్నాకర్ నాయకులు బొజ్జం రామ్ రెడ్డి, సారయ్య, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘రేషన్ కార్డులు పేదలకు వరం’ – యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 15**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో, ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ చొరవతో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టిన సందర్భంగా, హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి మంత్రుల చిత్రపటాలకు పాలభిషేకం చేయడం జరిగింది.





ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు చల్లూరి రాహుల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమనేని పరుశురాం, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం లో పేదలు సుభిక్షంగా ఉండాలనే ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందనీ, రేషన్ కార్డు పేదవారి ఆత్మగౌరవం అని అన్నారు. 10 యేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వాలన్న ఆలోచన మాత్రం చేయలేదనీ, మన ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం కోసం రేషన్ షాపుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నరన్నారు. కొత్తగా 5.6 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరు అయినవనీ, 26 లక్షల మంది పేర్లు కొత్తగా రేషన్ కార్డులలో నమోదు చేసి, 3.10 కోట్లమందికి సన్నబియ్యం పంపిణీ జరుగుతుందనీ తెలిపారు. రైతులు సంతోషంగా ఉంటేనే ఇందిరమ్మ ఆత్మ సంతోషంగా ఉంటుందనీ, సోనియమ్మ కల నెరవేరుతుందనీ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజాధనాన్ని దోచుకుందే తప్ప, పేదవారికి పట్టడం అన్నం పెట్టాలన్న ఆలోచన మాత్రం చేయలేదన్నారు. ప్రజలంతా ఆశీర్వాదాలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గొప్ప మెజారిటీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలోబీ యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పాతకాల రమేష్, రేవంత్, మండల ఉపాధ్యక్షులు అరుణ్, జమ్మికుంట మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, దేవునూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబుషి అజయ్, యూత్ నాయకులు రాచపల్లి రాజు, ఏరెడ్డి సతీష్, జావిద్, ఇటుకల గణేష్, పచ్చిమట్ల భాను, బండి పవన్, దీపక్, వెంకటేష్, అష్రఫ్, జాన్సన్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయ డిప్యూటీ సీఈవోగా శ్రీమతి గీత బాధ్యతలు స్వీకరణ



**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్.**

జిల్లా కలెక్టర్ ను పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీమతి గీత. మంగళవారం మెదక్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా శ్రీమతి గీత జిల్లా కలెక్టర్ ను కలిసిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా పనిచేసి శ్రీమతి గీత బదిలీపై డిప్యూటీ సీఈఓ గా మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించామని తెలిపారుజిల్లా పరిషత్ కార్యకలాపాలను జడ్పీ సీఈఓ గారి సూచనలు సలహాలు పాటిస్తూ ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్







**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూలై 15**

ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్యాంపెయిన్ ఐహెచ్ పి ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇందులో భాగంగా బీపీ షుగర్ టిబి హెచ్ఐవి హెపటైటిస్ బి వంటి పరీక్షలు పూర్తిస్థాయిలో చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఐసిటిఎస్ విభాగం పాల్గొని పరీక్షలు కౌన్సిలింగ్ చేయడం జరిగింది..ఇందులో 30 సంవత్సరాల పైబడ్డ వాళ్లకు బీపీ షుగర్ టెస్టులు చేసి మందులు పూర్తిగా అందించడం జరిగింది.. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసీదాస్. లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ నిక్కత్ ఫిర్దోస్ డాక్టర్ కళ్యాణ్ డాక్టర్ హిమజ ( ఎం ఎల్ హెచ్ పి )రోజా సిహెచ్ఓ శ్యామల విజయశ్రీ,బాలశౌరి, శ్రీనివాస్, రోజా రాణి,, సునీత, అజీజ్ ఈఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# 20వ తేదీన రామప్ప ఆర్టీసీ స్పెషల్ బస్ : సౌకర్యము కల్పిస్తున్నాం డిపో మేనేజర్






**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జులై 15**

హుజురాబాద్ పట్టణం మరియు జమ్మికుంట మండలం లోని ప్రయాణికులకు మల్లూరు , మేడారం , రామప్ప , లక్నవరం వెళ్ళే వారికి అవకాశం కల్పిస్తున్నాం అని హుజురాబాద్ డిపో మేనేజర్ రవీంద్ర నాథ్ గారు తెలిపారు. జూలై 20 తేదీన ఉదయం 06:00 ఏ ఏం హుజురాబాద్ డిపో నుండి ప్రత్యేక బస్ ఏర్పాటు చేశాం అని ప్రయాణికులకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని తెలిపారు. బస్ టికెట్ ధర పెద్దలకు 800 /- మరియు పిల్లలకు 430 /- అడ్వాన్స్ బుకింగ్ కొరకు DM:9959225924 STI:9704833971 మరియు 9866117385,9247159535,9177324963 సంప్రదించండి. అని హుజురాబాద్ డిపో మేనేజర్ రవీంద్ర నాథ్ గారు తెలిపారు. అలాగే ప్రయాణికులతో పాటు, విహార యాత్ర కోసం వెళ్ళే వారికి మరియు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్రలకు అతి తక్కువ ధరకు స్పెషల్ బస్ ఇస్తాము అని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలి అని హుజురాబాద్ డిపో మేనేజర్ రవీంద్ర నాథ్ తెలిపారు.

# ఆషాఢ మాసం గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మనాలి ఠాకూర్



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 15:**

గోదావరిఖని ఎన్టీపీసీ కృష్ణ నగర్ లో మహిళలు ఏర్పాటుచేసిన ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి, సామాజిక సేవాకురాలు మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంప్రదాయ బద్ధంగా, స్త్రీల ఆరాధనకు సంబంధించిన ఈ గోరింటాకు వేడుకలో మహిళలతో కలిసి మనాలి ఠాకూర్ పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరితో వారు స్నేహపూర్వకంగా మమేకమై, వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మన సంస్కృతి సంప్రదాయాల్లో ఆషాఢ మాసానికి ఒక విశేష స్థానం ఉందని, ఈ మాసంలో జరుపుకునే గోరింటాకు వేడుకలు మహిళల ఐక్యత, శ్రేయస్సు, సౌభాగ్యనికి నిదర్శనంగా నిలుస్తాయి. ఇటువంటి ఆత్మీయ కార్యక్రమాల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ ప్రతి మహిళ సాధికారతకు, అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్నారనీ, వారి మార్గదర్శనంలో మహిళలకు మరింత మద్దతుగా నిలుస్తామని మనాలి ఠాకూర్ తెలిపారు.